# ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో రిపోర్టింగ్ వ్యవస్థ (రూల్ 346-350)

పరిచయం ప్రజాస్వామ్యం అంటే చర్చలు, వాదనల ద్వారా నిర్వహింపబడే పాలనా వ్యవస్థ. భారతదేశంలో మనం వర్తింపచేసుకున్న బ్రిటన్ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు పలికే పలుకులు, చట్ట సభల కార్యకలాపాలు అత్యంత కీలక భూమికను నిర్వహిస్తాయి. రాజ్యపాలన సమర్థవంతంగా సాగేందుకు అవి దోహదపడతాయి. ప్రజల అత్యుత్తమ ప్రయోజనాలకు అనుగుణంగా కార్య నిర్వాహకవర్గం తగిన నిర్ణయాలను తీసుకొనేందుకు అవి సహకరిస్తాయి. చట్టసభల కార్యకలాపాలు సమకాలీన చరిత్రకు ఒక ఆధారంగా కూడా నిలుస్తాయి. ఎందుకంటే సభలో ఏదైనా అంశంపై తాము చేసే వాదనకు సమర్థింపుగా గౌరవ సభ్యులు అంతకు పూర్వం జరిగిన సభా కార్యకలాపాల నుండి విస్తృతంగా ఉటంకింపులు, ప్రస్తావనలు చేస్తుంటారు. అందువల్ల చట్టసభలలో జరిగే చర్చలు, ప్రసంగాలు, వాదనలను యథాతథంగా వారి మాటలలోనే లిఖిత పూర్వక రికార్డుగా నిర్వహించడం అవసరం అవుతుంది.

### ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రిపోర్టర్ల విభాగం :

యునైటెడ్ కింగ్డమ్లోని హాన్సర్డ్ పద్ధతినే ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోని రిపోర్టర్ల విభాగం అనుసరిస్తుంది. సభలో చెప్పిన ప్రతిమాటను యథాతథంగా రిపోర్టర్ల విభాగం లిఖిత పూర్వకంగా రికార్డు చేస్తుంది. ఈ విభాగంలో ఒక ప్రధాన రిపోర్టరు, ఇంగ్లీషు - తెలుగు భాషలకు చెందిన రిపోర్టర్లు ఉంటారు. రిపోర్టింగులో అధిక వేగం, ఖచితత్వం ఉండేందుకు వీలుగా కంప్యూటర్లు, వాటికి అవసరమైన సాఫ్ట్ వేర్ వంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలను రిపోర్టర్ల విభాగానికి సమకూర్చటం జరిగినది.

### శాసనసభ భాష : (రూల్ 346)

భారత రాజ్యాంగంలోని 210 అధికరణను అనుసరించి సభాకార్యక్రమాలను రాష్ట్ర అధికార భాషలో కాని, హిందీలో కాని, ఇంగ్లీషులో కాని నిర్వహించ వచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు అధికార భాషగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ కార్య విధాన నియమావళి లోని 346 నియమం సభా కార్యక్రమాలను తెలుగులో కాని, ఇంగ్లీషులో కాని నిర్వహించవచ్చునని పేర్కొంటుంది. ఏ సభ్యుడైనా ఈ రెండు భాషలలో తన అభిప్రాయాలను తగిన విధంగా వ్యక్తీకరించలేనని భావించినట్లయితే, సభాపతి అనుమతితో మరే ఇతర భాషలోనైనా సభను ఉద్దేశించి ప్రసంగించవచ్చు.

### రికార్డింగు పద్ధతి

సభ ప్రారంభమైన దగ్గరనుండి ముగిసే వరకు తెలుగు, ఇంగ్లీషు భాషలకు చెందిన ఒక్కొక్క రిపోర్టరు సభలో ఉంటూ సభ కార్యక్రమాలను యథాతథంగా ప్రతిమాటను లిఖితపూర్వకంగా రికార్డు చేస్తారు. ఇలా ఒక్కొక్క రిపోర్టరు తీసుకున్న యథాతథ లిఖిత పూర్వక ఈ రికార్డును ప్రధాన రిపోర్టరు సంకలనం చేస్తారు.

### సభ్యులచే ప్రసంగాల నిర్ధారణ :

సభలో సభ్యుడు అడిగిన ప్రతి ప్రశ్న, చేసిన ప్రసంగం, మధ్యలో తలెత్తిన అంతరాయాలతో సహా యథాతథ లిఖిత రికార్డు ప్రతిని సభ్యుల నిర్ధారణ కోసం, దిద్దుబాటుల కోసం ఆయా సభ్యులకు ఆ మరుసటిరోజే అందజేస్తారు. వ్యాకరణదోషాలు, ఉటంకింపుల రిపోర్టింగులో లోపాలు, సంఖ్యలు, పేరు మున్నగువాటికి సంబంధించిన స్వల్ప దిద్దుబాటులను మాత్రమే అనుమతిస్తారు. భాషాపరమైన మెరుగుదలకు కాని, మార్పులు, చేర్పులు, తొలగింపుల ద్వారా విషయాన్ని మార్పు చేయడానికి కాని అనుమతించరు. సభ్యుడు తనకు అందిన ప్రతిని 24 గంటలలోగా నిర్ధారించి తిరిగి దానిని వెనక్కి అందజేయాల్సి ఉంటుంది. సభ్యుడు ఆ ప్రతిని తిరిగి వెనక్కి ఇచ్చేటప్పుడు దానిపై తన సంతకం చేసి అధీకృతమొనర్చాలి. నిర్ధారిత సమయంలో కనుక సభ్యుడు ఆ ప్రతిని తిరిగి వెనక్కి పంపనట్లైతే, రిపోర్టర్లు అందజేసిన ప్రతే అంతిమ ప్రతిగా ఖరారు అవుతుంది. నిర్ధారణ కోసం తమకు అందచేసిన ప్రతిలో సభ్యులు చేసిన దిద్దుబాటులను కార్యక్రమాల అధికారిక నివేదికలో కూడా చేరుస్తారు. అలా జరిగినప్పుడు అధికారిక నివేదికలో ఆ సభ్యుని పేరుకు ఎదురుగా నక్షత్రపు

గుర్తును పెట్టి, ఆ పేజీ క్రింద "సభ్యునిచే నిర్ధారింప బడినది" అనే పాదసూచికను కూడా ప్రచురిస్తారు.

### ఎడిటింగ్ మరియు తొలగింపులు : (రూల్ 348)

సభా కార్యక్రమాల యథాతథ లిఖిత రికార్డును ప్రధాన రిపోర్టరు పరిశీలిస్తారు. సభాపతి ఆదేశాలు, కార్యవిధాన నియమావళి, నిర్ధారిత పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా ఆ లిఖిత రికార్డు ఉండేటట్లు ఆయన చూస్తారు. సభలో చర్చల సమయంలో అపఖ్యాతికరమైన, అనుచితమైన, పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమైన, అమర్యాదకరమైన పదాలను ఉపయోగించినట్లు సభాపతి భావించినట్లైతే, సభాకార్యక్రమాల అధికారిక నివేదిక నుండి ఆ పదాన్ని లేదా పదాలను తొలగించమని తన విచక్షణాధికారాన్ని వినియోగించి అదేశమివ్వవచ్చు. సభాపతి ఇచ్చిన ఆ ఆదేశాలను ప్రధాన రిపోర్టరు అమలు చేస్తారు. సభాపతి ఆదేశాల మేరకు ఆ పదాలను సభాకార్యక్రమాల అధికారిక నివేదిక నుండి తొలగించి, తదనుగుణమైన తదుపరి మార్పులను కూడా చేస్తారు. సభా కార్యక్రమాల నివేదిక నుండి తొలగించిన భాగాల వద్ద నక్షత్రపు గుర్తులను ముద్రిస్తారు. "సభావతి ఆదేశాల మేరకు తొలగించడమైనది" అనే పాద సూచికను కూడా చేరుస్తారు.

### ముద్రణ, ప్రచురణ :

ఎడిటింగ్ పూర్తయిన తరువాత ప్రతి సమావేశపు సభా కార్యక్రమాల సంపూర్ణ నివేదికను గౌరవ సభాపతి నిర్ధారించిన రూపంలో, పద్ధతిలో



కార్యదర్శి ముద్రణ చేయించి ప్రచురిస్తారు. తొలగించమని సభాపతి ఆదేశించిన పదాలు, వ్యక్తీకరణలు మినహా సభాకార్యక్రమాలలో జరిగిన ప్రతిచర్చ, మౌఖిక, రాతపూర్వక ప్రశ్నలను ఉత్తమ పురుష రూపంలో యథాతథంగా ప్రచురించడం జరుగుతుంది. అలా ప్రచురించిన సభా కార్యక్రమాల నివేదిక బహిరంగ పత్రంగా ఉంటుంది. న్యాయ స్థానంలో దానిని సాక్ష్యంగా కూడా ఉటంకించ వచ్చు. ముద్రితమైన ఒక సెట్టు కార్యక్రమాల నివేదికను సభ్యులందరికి ఉచితంగా అందజేస్తారు. పాత శాసనమండలి కమిటీల కార్యకలాపాల రిపోర్టింగు ప్రభుత్వ లెక్కల కమిటి, ప్రభుత్వరంగ సంస్థల కమిటి, అంచనాల కమిటి వంటి అనేక ఇతర శాసనమండలి కమిటీ సమావేశాలను కూడా రిపోర్టర్లు నివేదిస్తారు. కమిటీ సమావేశంలో జరిగే కార్యక్రమ స్వభావాన్ని బట్టి ఆ కార్యక్రమాన్ని యథాతథంగా కాని, ఆ కార్యక్రమ సారాంశాన్ని కాని రిపోర్టర్లు లిఖిత పూర్వక రికార్డుగా నివేదిస్తారు. కమిటి తన సిఫారసులను రూపొందించి శాసన మండలికి తన నివేదికను సమర్పించే వరకూ రిపోర్టర్లు నివేదించిన కమిటి కార్యక్రమాల రికార్డును గోప్యమైన రికార్డుగా పరిగణిస్తారు.



# 25

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## రిపోర్టింగ్ వ్యవస్థ




**ఆంధ్రప్రదేశ్ శాసన మండలి**
**సచివాలయం, వెలగపూడి, అమరావతి.**